

ఇటీవల దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను కలిసి రైళ్లు నడపాలని కోరిన మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి






సిద్దిపేట రైల్వేస్టేషన్ ట్రాక్‌లు



సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన టికెట్ బుకింగ్ కౌంటర్

# సిద్దిపేటకు రైలుకూత

## రైలు కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్

- నేటి నుంచి సిద్దిపేట -కాచిగూడ మధ్య రైల్వేసేవలు
- మధ్యాహ్నం మూడు గంటలకు సిద్దిపేటలో ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట-కాచిగూడ మధ్యన నడవనున్న రెండు రైళ్లు
- సమైక్య రాష్ట్రంలో కాగితాలకే రైల్వేలైన్ పరిమితం
- నాలుగు జిల్లాలో రైల్వేలైన్ పొడవు 151.36 కిలోమీటర్లు
- ఉత్తర తెలంగాణలో ఈ రైల్వేలైన్ కీలకం
- రైల్వే సౌకర్యంతో మరింతగా సిద్దిపేట అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు

సిద్దిపేట, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా ఏర్పాటు, గోదావరి నీళ్లు, రైలు, మెడికల్ కళాశాల నాడు ఎన్నికల నినాదాలు... ఇవాళ సీఎం కేసీఆర్ ఆ నినాదాలను నిజం చేశారు. ఆ పనులు ప్రజల కండ్ల ముందు ఆవిష్కృతమయ్యాయి.జిల్లా ఏర్పాటు చేసుకొని చక్కటి పరిపాలనను అందించుకుంటున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు రావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమైంది. ఇవాళ రైలు వచ్చేస్తోంది. దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న జిల్లా ప్రజల కలలు సాకారం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం (నేటి) నుంచి సిద్దిపేట-(సికింద్రాబాద్) కాచిగూడకు రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. మధ్నాహ్నం మూడు గంటలకు సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు రైలును ప్రారంభించనున్నారు. ఇందుకోసం రైల్వే అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్‌ను మంజూరు చేయించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు కొత్త రైల్వేలైన్ నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటి వరకు 77కి.మీటర్లు రైల్వేలైన్ పనులు పూర్తిచేశారు. సిద్దిపేట జిల్లా పరిధిలో మరో 17 కిలోమీటర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో రైల్వే లైన్ నిర్మాణం చేయాల్సి ఉంది.ఈ జిల్లా పరిధిలో 954 ఎకరాల భూసేకరణకు 808 ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ, మంత్రి హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భూసేకరణ, తదితర పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయడంతో జెట్ స్పీడ్‌లో రైల్వేలైన్ పూర్తి చేసుకోగలిగాం.సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరు వరకు రైళ్లు ప్రారంభించడంతో పాటు, ప్యాసింజర్ రైలు నడపాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను స్వయంగా కలిసి విన్నవించారు. దేశ చరిత్రలోనే అత్యంత వేగంగా సిద్దిపేట రైల్వేలైన్ పూర్తి అయిందంటే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూ సేకరణ చేసి రైల్వేశాఖకు ఇవ్వడం వల్లనే సాధ్యమైంది. దేశంలో మొట్టమొదటిసారి ఒక్క కోర్టు కేసు కూడా లేకుండా ఈ ప్రాజెక్టు పూర్తి చేయగలిగారు. 2,200 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగించింది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద చెల్లించాల్సిన డబ్బులను చెల్లించింది. నిధులు సమయానికి విడుదల చేయడంతోసిద్దిపేట రైల్వేలైన్ పూర్తి చేసుకోగలిగాం.మొత్తంగా సుమారు వెయ్యికోట్ల వరకు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తి చేశారు.

### ఉత్తర తెలంగాణలో ఈ రైల్వేలైన్ కీలకం

ఉత్తర తెలంగాణ జిల్లాలకు ముఖ్యమైన రైల్వే రవాణా మార్గం ఇదే. ఈ రైల్వేలైన్‌లో గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు నడుస్తాయి. భవిష్యత్‌లో ఈ లైన్ ఉత్తర దక్షిణాదికి ముఖ్యమైన రైల్వే మార్గంగా రూపుదిద్దుకుంది.ఈలైన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు నిర్మాణం జరుగుతుంది. అక్కడి నుండి పెద్దపల్లి లైన్‌కు అనుసంధానం అవుతుంది. దీని ఫలితంగా ఢిల్లీ, కలకత్తా తదితర మహానగరాలకు లింకు అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ఈ రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 2025 నాటికి పూర్తిచేయాలని గడువు ఉంది.

### నాలుగు జిల్లాల్లో రైల్వేలైన్ పొడవు 151.36 కిలోమీటర్లు

సికింద్రాబాద్ – మన్మాడ్ వెళ్లే మార్గంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి రైల్వేలైన్ ప్రారంభమై సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, బోయినిపల్లి మీదుగా కరీంనగర్ జిల్లాలోని వెదిర మీదుగా పెద్దపల్లి– నిజామాబాద్ వెళ్లే మార్గంలో కొత్తపల్లి వద్ద ఈ లైన్ కలుస్తుంది. ఈ రైల్వేలైన్ పొడవు 151.36 కి.మీటర్లు ఉంటుంది. రూ. 1160.47 కోట్ల అంచనాతో పనులు ప్రతిపాదించారు. రైల్వేలైన్ నిర్మాణానికి సుమారు 2,200 ఎకరాల భూమి అవసరం ఉండగా సిద్దిపేట జిల్లాలో పూర్తి స్థాయిలో భూసేకరణ పూర్తి చేసి రైల్వేశాఖకు అప్పగించి పనులు పూర్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 954 ఎకరాల భూసేకరణకు 808 ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు.రైల్వే లైన్ నాలుగైదు దశల్లో పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఆదిశగానే పనులు చేశారు. ఈ రైల్వేలైన్ నిర్మాణం మెదక్ జిల్లాలో 9.30 కి.మీటర్లు, సిద్దిపేట జిల్లాలో 83.40 కి.మీటర్లు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 37.80 కి.మీటర్లు, కరీంనగర్ జిల్లాలో 20.86 కి.మీటర్ల మేర మొత్తం 151.36 కి.మీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేస్తారు. నాలుగు జిల్లాలో మొత్తం 15 రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు.


### నాటి నినాదాలను నేడు నిజం చేసిన సీఎం కేసీఆర్

నలభై ఏండ్ల నుంచి విన్నాం... గోడల మీద రాతలు, ఎన్నికల నినాదాలు, అందమైన కరపత్రాలు, వినివిని అలిసిపోయాం. కానీ సమైక్య రాష్ట్రంలో పనులు మాత్రం కాలేదు..సిద్దిపేట జిల్లా, రైలు, గొదావరి నీళ్లు తెస్తా అని ఇలా ఎన్నో చెప్పారు.ఎన్నికల ముందు ఎన్నో మాట్లాడారు. నాడు ఎన్నికల నినాదాలే అయితే..ఇవాళ సీఎం కేసీఆర్ వాటిని నిజాలు చేసి చూపించారు. సిద్దిపేట జిల్లా ప్రజల రైలు కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మూలధనం వాటాగా మొత్తం ఖర్చు భరించి భూసేకరణ, రైల్వే ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో మూడో వంతు సమకూర్చడం, రైల్వే నిర్మాణం అనంతరం ఐదేండ్ల పాటు రైల్వేకు వచ్చే నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించడం అనే అగ్రిమెంట్‌తో మనోహరాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ మీదుగా కొత్తపల్లి కరీంనగర్ వరకు 151 కిలో మీటర్ల రైల్వేలైన్‌ను ఆనాడు కేంద్ర మంత్రిగా కేసీఆర్ రైల్వేలైన్ మంజూరు చేయించారు. ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దాదాపు వెయ్యికోట్ల రూపాయలు ఇస్తే రైలు కల నిజమైంది. నేటి నుంచి రైలు ప్రారంభమవుతున్నది.రోజుకు నాలుగు ట్రిప్పులు నడుస్తున్నది. రాబోయే రోజుల్లో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరుకు కూడా రైలు నడుపుకుంటాం. విద్యుత్ లైన్ కోసం రూ.150 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పిలిచాం. నాలుగైదు నెలల్లో విద్యుద్ధీకరణ పనులు పూర్తవుతాయి.విద్యుత్ లైన్ పూర్తి అయ్యాక గంటన్నరలోనే సికింద్రాబాద్ చేరుకుంటాం. రైలు సౌకర్యం రావడంతో ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతున్నది. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తాయి. యువతకు ఉపాధి దొరుకుతున్నది.

– తన్నీరు హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి



సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో సిద్ధమైన సిగ్నలింగ్ వ్యవస్థ



### సమైక్య రాష్ట్రంలో రైల్వేలైన్ కాగితాలకే పరిమితం

సమైక్య రాష్ట్రంలో మనోహరాబాద్– కొత్తపల్లి రైలు మార్గం కాగితాలకే పరిమితమైంది.అప్పటి ఆంధ్రా పాలకులు రాష్ట్రం వాటాను చెల్లించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో పాటు ఉద్యమనేతనే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ ప్రజల కోరికలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించారు. రాష్ట్రం వాటాను చెల్లించడంతో పాటు రైల్వేలైన్ నిర్మాణ పనులకు కావాల్సిన భూసేకరణ చేసి ఇవ్వడంతో శరవేగంగా మనోహరాబాద్ –కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణ పనులు సిద్దిపేట వరకు జరిగాయి. 2005 –2006లో యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ మూలధనం వాటాగా మొత్తం ఖర్చు భరించి భూసేకరణ, రైల్వే ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో మూడో వంతు సమకూర్చడం, రైల్వే నిర్మాణం అనంతరం ఐదేండ్ల పాటు రైల్వేకు వచ్చే నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించడం అనే అగ్రిమెంట్‌తో మనోహరాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ మీదుగా కొత్తపల్లి కరీంనగర్ వరకు 151 కిలోమీటర్ల రైల్వేలైన్ మంజూరు చేయించారు. అప్పట్లో రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం వాటాగా చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడం, భూసేకరణ చేయకపోవడం కారణంగా 2014 వరకు రైల్వే ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎం కేసీఆర్ మనోహరాబాద్ – కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిధులు విడుదల చేశారు. త్వరగా భూసేకరణ చేయడంతో రైల్వే చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా వేగంగా రైల్వే లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.



సిద్దిపేట రైల్వేస్టేషన్‌లోని రైల్వేప్లాట్ ఫాం

### రైలు ప్రయాణం ఇలా...


| రైలు మార్గం | బయలుదేరు టైం | చేరుకునే టైం |
|---|---|---|
| సిద్దిపేట– కాచిగూడ | ఉ 6–45 | ఉ 10–15 |
| | మ 2–05 | సా 5–10 |
| కాచిగూడ –సిద్దిపేట | ఉ 10–35 | మ 1.45 |
| | సా 5–45 | రా 8.40 |

టికెట్ ధర: సిద్దిపేట – సికింద్రాబాద్ (కాచిగూడ) రూ. 60
నెల పాస్ టికెట్ ధర రూ. 290

మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా సిద్దిపేట వరకు రైల్వేలైన్ పూర్తికావడంతో వారంలో ఆరు రోజులు రెండు రైళ్లు నడపడానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మంగళవారం నుంచి రైలు సేవలు ప్రారంభంకానున్నాయి.ఈ రైలు మార్గం గుండా 70 గ్రామాలు, పుణ్యక్షేత్రాల మీదుగా రైలు వెళ్లనున్నది. ఎనిమిది కోచ్‌లు కలిగి ఉండే పుష్ పుల్ రైలులో ఏకకాలంలో సుమారు వెయ్యి మంది వరకు ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. సిద్దిపేట నుంచి బయలు దేరిన రైలు దుద్దెడ, లకుడారం, కొడకండ్ల , గజ్వేల్ రైల్వేస్టేషన్, అప్పాయపల్లి, నాచారం, మనోహరాబాద్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, బొల్లారం, క్యావల్రీ బ్యారక్స్, మల్కాజిగిరీ మీదుగా కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది.ప్రస్తుతం గజ్వేల్ వరకు గూడ్స్ రైలు రాకపోకలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.. భవిష్యత్‌లో తిరుపతి, బెంగళూరు వరకు రైళ్లు నడిపేవిధంగా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.కొమురవెల్లి స్టేషన్ మంజూరు చేయించారు. ఇక్కడ పనులకు టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నారు. రూ. 150 కోట్లతో విద్యుత్ లైన్ (రైల్వేలైన్ )నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో ఆరు నెలల్లో విద్యుత్ లైన్ పనులు పూర్తయితే గంటన్నరలోపే సికింద్రాబాద్ చేరుకోవచ్చు. ప్రస్తుతం డిజిల్ ఇంజన్ కావడంతో సరాసరి మూడు గంటల సమయం పడుతుంది.




సిద్దిపేట రైల్వేస్టేషన్



### సిద్దిపేట రైల్వేస్టేషన్

సిద్దిపేట శివారులోని నర్సాపూర్, కేసీఆర్ నగర్ కాలనీ సమీపంలో ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగింది.ఈ రైల్వేస్టేషన్ వద్ద ఐదు ట్రాక్ లైన్లలో మూడు లైన్లలో ప్యాసింజర్ రైళ్లు, (వీటిలో రెండు ప్లాట్ ఫామ్ ట్రాక్‌లు ఒకటి మైయిన్ లైన్), 4వ లైన్‌లో గూడ్స్ రైళ్లు, 5వ లైన్‌లో ప్యాకింగ్, మరమ్మతులు, ఇంజిన్ల సైడింగ్ కోసం వినియోగిస్తారు.ఇక్కడనే గూడ్స్ షెడ్ నిర్మాణం కూడా చేస్తున్నారు. ఇక స్టేషన్‌లో వీఐపీ లాంజ్, ఫస్ట్ క్లాస్, జనరల్ క్లాస్ వేయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్, లిఫ్ట్ తదితర పనులన్నీ పూర్తి చేశారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో రైలు నడవనున్నది.తిరుపతి, బెంగళూరు ప్రాంతాలకు రైలు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా హైదరాబాద్ నుంచి మనోహరాబాద్ మీదుగా గజ్వేల్ వరకు రైలు సేవలు ప్రారంభమై రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడి రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు ద్వారా ఎరువులను తీసుకువచ్చి జిల్లాలోని అన్ని ప్రాంతాల రైతులకు సరఫరా చేస్తున్నారు.దీంతో ఎరువులను తీసుకురావడానికి సనత్‌నగర్ రేక్ పాయింట్‌కు వెళ్లాల్సిన శ్రమ తగ్గింది.

దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ప్రజల రైలు కల సాకారమైంది. రైల్వే సౌకర్యం ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందనున్నది. ఎంతో మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలు ఉన్నాయి. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మించే రైల్వేలైన్ పెద్దపల్లి వద్ద కలుస్తున్నది. దీంతో కలకత్తా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు వెసులుబాటు కలుగుతున్నది. మనోహరాబాద్ నుంచి ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లవచ్చు.ఈ రైల్వేలైన్ నిర్మాణంతో మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగనున్నది. ప్రధాన పుణ్యక్షేత్రాలను కలిపే రైల్వేలైన్ అని చెప్పవచ్చు.వేములవాడ రాజన్న, కొమురవెల్లి మల్లన్న, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు ఉన్నాయి. గజ్వేల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. కాలుష్య రహిత పరిశ్రమలు నెలకొల్పేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. సిద్దిపేట జిల్లాలో పెద్దఎత్తున రిజర్వాయర్ల నిర్మాణాలు జరిగాయి. భవిష్యత్‌లో మంచి పర్యాటక ప్రాంతం కానున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో కొండపోచమ్మ రిజర్వాయర్ ఉన్నది. ఇక్కడికి సుమారుగా 30 కి.మీ

### రైల్వేసౌకర్యంతో మరింత అభివృద్ధి

దూరంలో కొండపోచమ్మ దేవాలయం ఉంది. ఈ దేవాలయం పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్కడి నుంచి మరో 25 కి.మీ దూరంలో భక్తుల కొంగు బంగారం కొమురవెల్లి మల్లన్న ఆలయం ఉంది. ఇక్కడికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మ ఆలయానికి వెళ్తారు. అక్కడి నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కు వెళ్లవచ్చు. రంగనాయక సాగర్‌ను వంద కోట్లతో పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక ఉత్తర తెలంగాణ వరప్రదాయినైన కొమురవెల్లి మల్లన్న రిజర్వాయర్‌ను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. మల్లన్న వనాల పేరుతో మంచి పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నారు.



సిద్దిపేట రైల్వేస్టేషన్ వద్ద రైల్వేట్రాక్ లైన్లు